ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 17 సెప్టెంబరు 2025 | 5



## జీవీపీలో సత్యవాణి!

కష్టే ఫలి అన్నారు పెద్దలు.. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందనేది అర్థం.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె.సత్యవేణి జీవీపీ సాధనలో రాష్ట్రంలో ప్రథమంగా నిలిచింది.. అమరావతిలో సీఎం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆమె పేరు మారుమ్రోగింది. ఈ మేరకు బిక్కవోలు మండల పరిషత్ తరఫున ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మంగళవారం ఆమెను సత్కరించారు. - బిక్కవోలు



## పది ఫెయిలై.. చోరీల బాటపట్టారు!

ఆ ఐదుగురు యువకులే.. పదవ తరగతి ఫెయిలైపోయారు.. జల్సాలకు అలవాటు పడిపోయారు.. ఈజీ మనీ కోసం వేట ఆరంభించారు.. బైక్‌ల దొంగతనాలను వృత్తిగా మలచుకున్నారు.. ఒకటా రెండా ఏకంగా 26 బైక్‌లు, స్కూటర్లను కొట్టేశారు.. ఇటీవల తనిఖీల్లో ఒక యువకుడు పెరవలి పోలీసులకు చిక్కగా తీగలాగారు.. డొంక కదిలింది.. ఉభయగోదావరి జిల్లాలతో పాటు.. వైజాగ్‌లోనూ చోరీలకు తెగబడినట్టు తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఐదుగురిని కటకటాల్లోకి పంపారు. 7

## ఓహో జోన్!



ఇదేంటో చెప్పా.. ఆకారం చూస్తే 0 3లా ఉంది.. అంటే ఏంటో తెలుసా.. ఓజోన్ అని అర్థం.. బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఓ3 ఆకారంలో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలోచింపజేశాయి.
- బిక్కవోలు



## రాజమహేంద్రవరం రూపురేఖలు మారుస్తా!

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం.. నాకో ప్రణాళిక ఉంది.. నా ప్లానింగ్‌కు పుష్కరాలు ఒక అవకాశం. ఎందుకంటే నిధుల కొరత ఉండదు. ఇప్పటికే సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నా..చారిత్రిక రాజమహేంద్రవరాన్ని మరింత సౌకర్యవంతంగా, సుందరంగా తీర్చిదిద్దుతానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో అభివృద్ధిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో కాసేపు ముచ్చటించారు. కేవలం ఏడాదిలోనే సుమారు రూ.190 కోట్ల అభివృద్ధి పనులు చేశానన్నారు. ఈ ఏడాది మరో రూ.130 కోట్లతో నల్లాఛానల్ మురుగు పోవడానికి మరో మార్గం సిద్ధం చేసి గోదావరిలో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీల సమస్య పరిష్కరించడంతో పాటు పార్కుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నానన్నారు. బత్తినగర్‌లో రూ. 60 లక్షలతో సంపు కమ్ పంపు హౌస్ నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. నగరంలోని 50 డివిజన్లలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. పలు జం క్షన్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు.రివర్‌ఫ్రంట్ పనులు వేగవంతం అయ్యాయని, అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా పుష్కరఘాట్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని,హేవలాక్ బ్రిడ్జిని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే పనులు త్వరలో మొదలుకానున్నాయన్నారు. పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం రూపు రేఖలు మారుస్తానన్నారు.

# జిల్లాలో అశాంతి.. అభద్రత వద్దు!



### కలెక్టర్, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతం చేయడంతో పాటు జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సమీక్షించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లాలో ఎవరైనా కలెక్టర్ ఒక ప్రాజెక్టు చేపట్టి ప్రశంసలు అందుకుంటే దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో ఎస్పీలు రాజీపడకుండా సమర్థవంతంగా సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మహిళల పట్ల అత్యాచారాలు, పిల్లల కిడ్నాప్‌లు, గంజాయి మత్తులో యువత చేస్తున్న అరాచకాల వంటి అంశాలపై జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా అంతా పనిచేయాలి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం దారుణంగా నష్టపోయింది. వృద్ధి రేటుపై పనిచేయడంతో పాటు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు మానవ వనరులను సమృద్ధిగా ఉపయోగించాలన్నారు. నేను, పవన్‌కల్యాణ్ శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. 30 శాతం క్రైమ్ రేటును తగ్గించే విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు పనిచేయాలని, సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త నినాదంతో ముందుకెళ్లాలని సీఎం ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా అధిక నీటి పారుదల సామర్థ్యం ఉంది. లైవ్ స్టాక్ ఉత్పత్తి ఉంది. ఆయిల్‌ఫామ్, వరి, కోకో వంటి అతి విలువైన పంటల సాగు ఉంది. జిల్లాలో 38 పరిశ్రమలు ఉన్నాయి. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కొత్త కార్గో టెర్మినల్ నిర్మాణం కూడా జిల్లాకు బలమేనని స్పష్టం చేశారు. బలహీనతలు అంటే జిల్లాలో సాంప్రదాయ పంటలను పరిమిత రకాలతోనే పండిస్తున్నారు. నీటిపారుదల పద్ధతులు పేలవంగా ఉన్నాయి. నేల సంరక్షణ తీరు బలహీనంగా ఉంది. పంటలు కోసిన అనంతరం వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు లేవని తేల్చారు.



అమరావతిలో మంగళవారం రెండో రోజు జరిగిన కలెక్టర్, ఎస్పీల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యం కావాలి
- పథకాలు వేగవంతం చేయాలి
- 15 శాతం వృద్ధి రేటు ఉండాలి
- ఎస్పీలు రాజీపడొద్దు
- పోలీసులు అప్రమత్తం కావాలి
- సాగు విధానంలో మార్పు రావాలి
- విమానాశ్రయంలో కార్గో టెర్మినల్

### మరణాల రేటు 11 శాతం

జిల్లాలో చదరపు కిలోమీటరుకు 716 మంది జనసాంద్రత ఉన్నట్టు లెక్క తేల్చారు. మరణాల రేటు 11 శాతంగా ఉంది. 2023-24లో ఇండియాలో మరణాల రేటు 7.42 శాతం ఉండగా, ఆంధ్రలో 6.3 శాతంగా ఉంది. కానీ జిల్లాలో 11 శాతంగా ఉందని నివేదిక తేల్చింది. తలసరి ఆదాయం రూ.2,55,650గా ఉంది.20 28-29కి రూ.5,21,778గా 2047-48కి రూ.50,67, 816గా పెంచాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇండస్ట్రియల్, సర్వీసు రంగాల ద్వారా 2023-24లో రూ.56, 468 కోట్లు ఆదాయం రాగా 2028-29కి రూ.1,15,539 కోట్లు, 2047-48కి రూ.10,19,903 కోట్ల లక్ష్యంగా నిర్ణయించారు.

### పంటల సాగు మార్చండి..

జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో చేల గట్ల మీద కందిపంట సాగు ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. 77,820 హెక్టార్ల సాగుకు అనుకూలంగా ఉండాలని నిర్ణయించారు. మినుములు 2595 హెక్టార్లు, పెసలు 1000 హెక్టార్లు, వేరుశనగ 258 హెక్టార్లు, కాటన్ 502 హెక్టార్లు సాగు చేయాలని నిర్ణయించారు. 4970 హెక్టార్లలో హార్టికల్చర్ పంటను ప్రోత్స హించే లక్ష్యంతోఉన్నారు. ఆర్కిడ్స్, కలర్ క్యాప్సికమ్, ఆఫ్ సీజన్ టమోటాలను 4 వేల హెక్టార్లలో సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకు న్నారు. డ్రాగన్, అవకాడో వంటి ఫ్రూట్స్ 10 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించారు. ఈసదస్సులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహకిశోర్ పాల్గొన్నారు.

# అవినీతిని తిరగదోడారు!

### 8 మంది అధికారులపై విచారణకు సిఫారసు

- ప్రైవేట్ వెంచర్‌లో వివాదం
- ప్రభుత్వానికి 5.82 కోట్లు నష్టం
- చాలా కాలం తర్వాత చర్యలు
- వీరిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసినా అవినీతి వెంటాడుతూనే ఉంటుంది. తమ హయాంలో జరిగిన తప్పుకు ఎప్పుడైనా సమాధానం చెప్పాల్సిందే. రాజానగరం మండలం పరిధి ఎస్‌బీ వెంచర్స్‌లో సామాజిక స్థలం (ఓపెన్ స్పేస్) తక్కువ విలువ చూపించి గతంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ పలువురు అధికారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్,రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖల అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ఆర్టికల్స్ ఆఫ్ చార్జ్ ఫ్రేమ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీని వల్ల ప్రభుత్వానికి రూ.5.82 కోట్ల నష్టం చేకూరినట్టు పేర్కొన్నారు. రాజా నగరం మండలంలో అప్పటి అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లుగా విధులు నిర్వహించిన ఎం.ప్రసాదరావు, సీహెచ్.శ్రీనివాసబాబు, జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ఎం.శ్రీనివాసమూర్తి,ఆర్.సత్యనారాయణలతో పాటు రాజానగరం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన తోలేటి సుబ్రహ్మణ్యం, క్రొవ్విడి విజయభాస్కరరావు, పీఆర్.కృష్ణభగవాన్, ప్రస్తుత దివాన్ చెరువు పంచాయతీ కార్యదర్శి కూచిమంచి హనుమంతరావులపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం కాకినాడ జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

# మాకూ బస్ కావాలి!



- మారుమూల రూట్లకు డిమాండ్
- పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ
- సవాల్‌గా మారుతున్న స్త్రీశక్తి
- ఆర్టీసీ అధికారులకు కొత్త చిక్కులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి - మహిళలకు ఉచిత బస్సు పథకానికి రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోంది. మా ఊరికి బస్సు నడపండి .. మా ఊరికి బస్సు నడపండి అంటూ కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కొవ్వూరు, నిడదవోలు మండలాలతో పాటు రాజానగరం, కడియం మండలాల్లోని మరికొన్ని గ్రామాల నుంచి కూడా ఇలాంటి వినతులు పెద్దఎత్తున వస్తున్నట్టు చెబుతున్నారు. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు డిపోలను ఆర్థిక, రాజకీయ కారణాలతో ఎత్తేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు మళ్లీ ఈ రెండు డిపోలను యథాతథంగా పునరుద్ధరించారు. అయితే గ్రామాల్లో తిరిగే చాలా సర్వీసులను రద్దు చేశారు. ఆదాయం వచ్చే రూట్లను కొనసాగించారు. దీంతో కొవ్వూరు, నిడదవోలు మండలాల్లోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడవడం లేదు. ఈ రెండు డిపోలు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి. ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో బస్సులు నడపాలంటూ ఆయా గ్రామాల నుంచి డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో స్త్రీ శక్తి రష్ భారీగా పెరిగింది. దీనికి అనుగుణంగా జిల్లా ఆర్టీసీ అధికారులు ఏ ఒక్క సర్వీసును రద్దు చేయకుండా నిర్ణీత షెడ్యూలు ప్రకారం బస్సులు తిప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా మరిన్ని డిమాండ్లు వస్తుండడంతో ఏం చేయాలో అర్థం కావడంలేదని అధికారులు వాపోతున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో ఉచిత బస్సు పథకం సాఫీగా అమలు చేయడం జిల్లా ఆర్టీసీ యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది.



పెద్దేవంలో పర్యటించి వివరాలు సేకరించిన పశు వైద్యాధికారులు

## పెద్దేవంలో గేదెలకు బి.కోలి, పొట్ట జలగ వ్యాధి

- ఇప్పటి వరకూ 9 గేదెలు మృతి
- 15 గేదెలలో వ్యాధి లక్షణాలు
- పశు సంవర్ధక అధికారుల చికిత్స

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో వరసగా పాడె గేదెలు మృతి చెందడానికి కారణాలు ధ్రువీకరణ అయినట్టు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డా.టి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ బి.కోలీ, పొట్ట జలగ వ్యాధులతో 9 గేదెలు మృతిచెందాయన్నారు. వ్యాధి నిర్ధారణ కావడంతో చికిత్స కొనసా గిస్తున్నామన్నారు.కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. ఆగస్టు 24న మొదటిసారిగా పాడె గేదెల మెడ ఎడమవైపున తెల్లటి మచ్చలు రావడంతో రైతులు చికిత్స చేయించారన్నారు. మూడు నుంచి నాలుగు రోజులు చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో 9 గేదెలు మృతి చెందాయన్నారు. రైతుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే వైద్య బృందం పెద్దేవం గ్రామం చేరుకుని పరీక్షలు నిర్వహించగా 15 గేదెలకు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారన్నారు. గేదెల రక్తం, పేడ, గడ్డి, దాణా, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపామన్నారు. పేడ పరీక్షలో బి.కోలి, పొట్టజలగ వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. దానికి అనుగుణంగా చికిత్స ప్రారంభించినట్టు పేర్కొన్నారు. కాకినాడలోని ప్రాంతీయ పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్ అధికారులు ఈ నెల 3న పెద్దేవం వెళ్లి అక్కడ గేదెల పరిస్థితిని, ఆ ప్రాంతాన్ని సందర్శించి నీటి నమూనాలు తీసి పరీక్షించారన్నారు.అందులో రెండు చోట్ల తక్కువ మోతాదులో హానికర రసాయనాలు ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు.ఈ నెల 13న విజయవాడ జీవశాస్త్ర పరిశోధన సంస్థ నిపుణులు పరిశీలించి వైద్య సూచనలు చేశా రన్నారు. గన్నవరంలోని శ్రీవేంకటేశ్వర వెట ర్నరీ విశ్వవిద్యాలయం విభాగాధిపతులు సోమవారం గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడి మరిన్ని నమూనాలు సేకరించారన్నారు. ఇప్పటికే బాధపడుతున్న గేదెలలో మూడింటి పరిస్థితి కొద్దిగా మెరుగుపడిందన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని..సిబ్బంది అందుబాటులో ఉన్నారని,ఎమర్జన్సీ పరిస్థితి ఉన్నా కంట్రోలు రూమ్ నంబర్ 9951505099లో సంప్రదించాలన్నారు.

# కందని ధర!



### దిగజారిన కంద ధర

- సగానికి సగం తగ్గుదల
- గతేడాది క్వింటా రూ.12 వేలు
- ఈ ఏడాది రూ.6 వేలు
- పడిపోయిన ఎగుమతులు
- లబోదిబోమంటున్న రైతాంగం
- పెట్టుబడులు రావని ఆందోళన
- నెమ్మదించిన కంద తవ్వకాలు

పెరవలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంద ధర చూసి రైతు ముఖం కందబారిపోతోంది. ఏం చేయాలో తోచక తెల్లముఖం వేసుకుని చూస్తున్నాడు. ధర బాగుంటుందని సాగు చేస్తే సగానికి సగం ధర తగ్గడంతో దిగాలుగా ఉండిపోతున్నారు. పంటను అమ్మలేక.. దాయలేక సతమతమవుతున్నాడు. రేటు దిగజారిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది క్వింటా రూ.12 వేల పలికిన కంద ప్రస్తుతం రూ.6 వేలకు దిగజారిపోవడంతో పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### విరివిగా కంద సాగు..

గత డిసెంబరు, జనవరి నెలలో కంద సాగు ఆరంభిస్తారు. పెరవలి మండలంతో పాటు ఉండ్రాజవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర మండలాల్లో కందను విరివిగా సాగు చేస్తా రు. ఎకరానికి సుమారు 25 గుత్తుల వరకు కంద కొనుగోలు చేసి నాటతారు. దీనికి ఎరు వులు, ఇతర ఖర్చుల కింద వేలాది రూపాయ లు పెట్టుబడులు పెడతారు. ఆగస్టు నెల నుంచి కంద పక్వానికి వస్తుంది. సెప్టెంబరు అక్టోబరు నెలల్లో కూడా తవ్వకాలు ఉంటాయి. ఈ ఏడాది ధర లేకపోవడంతో తవ్వకాలు నెమ్మదిగా సాగుతున్నాయి. ఎకరానికి 50 నుంచి 80 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో చేలు కౌలుకు తీసుకుని కంద సాగు చేసే రైతులు సిస్తులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రేటు సగానికి పడిపోవడంతో ఎటూ పాలుపోని స్థితి లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని..విత్తనం ఖరీదు రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.



### ఎకరాకు రూ.లక్ష నష్టం..

ఎకరం కంద సాగుకు పెట్టుబడి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అవుతుందని ప్రస్తు తం దిగుబడిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వస్తుందని దీంతో రూ.లక్ష పైగా నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇక్క డి నుంచి కంద బీహార్, పశ్చిమబెంగాల్,తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం రేటు బాగోలేకపోవడంతో ఎగుమతులు కూడా మందగించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.





మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాని

## 19న చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మిథున్ రెడ్డిని మాజీ మంత్రులు గోవర్ధన్ రెడ్డి, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాం గోపాల్ రెడ్డి మంగళవారం ములాఖత్ ద్వారా కలిసి మాట్లాడారు.చం ద్రబాబును ప్రశ్నించినా..విమర్శించినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సాధారణంగా ప్రభుత్వాల్లో చిన్న కేసు లను పెద్ద కేసులుగా బనాయిస్తారని.. చంద్రబాబు ఎక్కడా లేని కేసులను సృష్టిస్తున్నారన్నారు. తనను 86 రోజులు జైలులో పెట్టారన్నారు. సూర్యారావు మాట్లాడుతూ జగన్ స్థాపించిన రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలను వైసీపీ నాయకులు చూడడానికి వస్తే లోపలికి వెళ్లనీయకుండా అడ్డుపడ్డారన్నారు.రాం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. టీడీపీ ఏం చేసినా కేసుల్లేవని, వైసీపీ నాయకులకు సంబంధం లేకపోయినా కేసులు పెడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని హితవు పలికారు.


ప్రమాదకరమైన వాగు దాటి సరుకులు తీసుకెళ్తున్న ఏరువాడ కొండరెడ్లు

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటుతున్నా ఆ గ్రామస్తులకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. వారు బాహ్య ప్రపంచానికి రావాలంటే కొండలు ఎక్కి దట్టమైన అడవిలో కాలిబాటన పయనించాల్సిందే. అంతేకాదు పలు ప్రమాదకరమైన ఏరులు, వాగులు కూడా దాటాలి. దట్టమైన అడవిలో క్రూర మృగాల బారిన పడినా, వాగులు దాటేటప్పుడు ప్రమాదవ శాత్తు మునిగిపోయినా చేసేదేమీ లేదు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తినా, రేషన్ తీసుకోవాలన్నా వారికి ఇలాంటి ప్రయాణాలు తప్పట్లేదు.

ఆ గ్రామమే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాక సమీపంలోని దట్టమైన అడవిలో ఉన్న ఏరువాడ కొండారెడ్డి.

# సెల ఏరువాడ


దట్టమైన అడవిలో కాలి బాటన ప్రయాణం


వాగు దాటుతూ...

(మోతుగూడెం-ఆంధ్రజ్యోతి)

ఏరువాడ గ్రామంలో సుమారు 30 కుటుంబాల కొండారెడ్డి ప్రజలు జీవిస్తున్నారు. అడవిలో దొరికేవే వారికి జీవనాధారం. తాగునీటికి నేటికీ వాగులే ఆధారం. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా ఈ గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం. ఇందుకు కారణం ఈ గ్రామం దట్టమైన అడవిలో ఉండడమే. దీంతో అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. జ్వరం వచ్చినా, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా తలెత్తినా, ఆ అడవిలో ఏదైనా ప్రమాదం జరిగినా వారు మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తుంది. దట్టమైన ఏడు గుట్టలను దాటి కాలిబాటన రావాలంటే చాలా కష్టం. ఈ క్రమంలో చాలా మంది ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. రేషన్ సరుకుల కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తులసిపాక రావాల్సిందే. రేషన్‌ను కాలి బాటనే కష్టపడి వాగులు, వంకలు దాటి తీసుకెళ్లాల్సిందే.


చిన్న పిల్లతో వాగు దాటుతున్న దృశ్యం



- ఏరువాడ వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే!
- దట్టమైన అడవిలో ఓ కొండరెడ్డి గ్రామం
- నేటికీ రహదారి సౌకర్యం లేక అనేక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వాలు

ఏరువాడ గ్రామస్తులు ఎన్ని అవస్థలు పడుతున్నా రాజకీయ నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ గ్రామానికి కనీసం అధికారులు కూడా వెళ్లలేని దుస్థితి. వీరి సమస్యలను ఎవ్వరూ పట్టించుకోరు. గ్రామస్తులను బాహ్య ప్రపంచంలోకి తీసు కువచ్చి పునరావాసం కల్పించాలని గతంలో కొంతమంది అధికారులు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏరువాడ గ్రామస్తులు ఆ అడవిలోనే తమ జీవనం కొనసాగిస్తున్నారు. చింతూరు ఐటీడీఏ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి ఏరువాడకు రహదారి సౌకర్యం కల్పించాలని, లేదా ఆ గ్రామస్తులను వేరే ప్రాంతానికి తరలించి అక్కడ పునరావాసం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

### పిల్లల కోసం జీపీఎస్ పాఠశాల ఏర్పాటు

ఏరువాడలో గతంలో ఐటీడీఏ అధికారులు ఒక జీపీఎస్ పాఠశాలను ఏర్పాటుచేసి పిల్లలకు చదువులు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్కూల్లో 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు ఉండవు. అయినా వారు ఆ గ్రామంలోనే ఉంటూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం విశేషం.



### రాత్రయితే చిమ్మ చీకట్లో...

ఈ గ్రామానికి అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించలేకపోయారు. సోలార్ లైట్లు ఏర్పాటుచేసినా అవి తాత్కాలికంగానే పనిచేస్తాయి. దీంతో రాత్రివేళ కాగానే ఈ గ్రామం అడవిలో చిమ్మ చీకట్లోనే ఉండిపోతుంది.



మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి

'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' అమలు

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

# ఆరోగ్య 'షీ'రి



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాలతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉండే వారికి అండగా నిలిచి వారికి వైద్య సాయం అందించడమే 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) లక్ష్యం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

### ఏయే సేవలందిస్తారంటే..

మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తారు. గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన పోషకాహార ఆవశ్యకతను వివరిస్తారు. ఎంసీపీ కార్డులు అందిస్తారు. చిన్నారుల్లో సికిల్‌సెల్ అనీమియాను గుర్తించి చికిత్స చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, పోషణ్ అభియాన్, ఈట్ రైట్, తల్లీబిడ్డ సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆయుష్మాన్ వయో వందన ఆరోగ్య కార్డుల పంపిణీ, పరిశుభ్రత, పోషకాహారానికి సంబంధించి సమాచారం, కౌన్సిలింగ్ ఇస్తారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో ప్రత్యేక నమోదు చేస్తారు. సికిల్ సెల్ కార్డు, ఆభ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తారు.

## 226 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


బసవతారకం హాస్పిటల్ వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో నిర్వహిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు మంగళవారం 226 మంది హాజరయ్యారని హాస్పిటల్ వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వైద్య బృందంతో చర్చలు జరిపారు. క్యాన్సర్ పట్ల అవగాహన పెరిగి ప్రజలు టెస్టులు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారని వైద్యులు ఆయనకు తెలిపారు. వచ్చే నెలలో గ్రామంలో వేరొక చోట మూడు రోజుల పాటు క్యాంపు నిర్వహించాలని ఎమ్మెల్యే వారిని కోరగా అందుకు అంగీకరించారు. అలాగే ఈ రెండు రోజుల్లో 395 మందికి పరీక్షలు చేశామని క్యాన్సర్ వ్యాధి ఉంటే వారికి చికిత్సలు అందిస్తామన్నారు. బసవతారం వైద్యులు శ్రావణకుమారి, ప్రవల్లిక, రేణుక, ప్రభాకర్, కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పరీక్షలు నిర్వహించారు. సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌కు 200 మంది క్రీడాకారులు


పోటీల్లో జిమ్నాస్టిక్స్ చేస్తున్న బాలిక

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్-14, 17లో 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు.వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ కనబర్చారు.కార్యక్రమానికి స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిరాజు పాల్గొన్నారు.

### నేడు టీటీకి ఎంపికలు

కాగా బుధవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలురు, బాలికలకు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు తెలిపారు. వర్షం కారణంగా రబ్బీ, నెట్ బాల్ గేమ్స్ వాయిదా వేశామని, అవి ఎప్పుడు ఎక్కడ జరుగుతాయో త్వరలో ప్రకటిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు ఎలిజిబిలిటీ ఫార్మ్స్, మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248/96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవి రాజు తెలిపారు.

## 5.47లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతుండగా ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న మిగులు నీటి ప్రవాహంతో ఎగువున గోదావరి పెరుగుతోంది. మంగళవారం ఉదయం కాటన్ బ్యారేజ్ నుంచి 5.84లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసిన అధికారులు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సాయంత్రానికి 5,47,004క్యూసెక్కులు మిగులు ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తుందన్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.20 అడుగులుగా నమోదైంది. అల్పపీడనప్రభావంతో కురుస్తున్న వర్షాలకు డెల్టా కాలవలకు నీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 4200క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 37.70 అడుగులుగా నమోదైంది.

## పిఠాపురం ఆలయాల్లో మహారాష్ట్ర ఎంపీ పూజలు


అప్పా బర్నేకు స్వాముల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పలు ఆలయాలను మహారాష్ట్ర ఎంపీ, శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్ శ్రీరంగ్ అప్పా బర్నే సందర్శించారు. మంగళవారం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్నేను ఈవో ఆర్.సౌజన్య ఆలయ మర్యాదలతో సత్కరించి స్వాముల చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.అనంతరం అప్పా బర్నే పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.ఆయన్ను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం,ప్రసాదాలు అందజేశారు. ఎంపీ వెంట జనసేన నాయకులు పలువురు ఉన్నారు.

## నేడు నన్నయ వర్సిటీలో రిక్రూట్మెంట్ డ్రైవ్

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


సీఆర్‌టీ శిక్షణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 17న డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో బీఎస్సీ/ఎంఎస్సీలలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి పీజీ వరకూ 60శాతం మార్కులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. బీఎస్సీ పూర్తి చేసిన వారికి వార్షిక వేతనం రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ పూర్తి చేసిన వారికి రూ.2.60 లక్షలు వేతనం ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తారన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం ప్లైస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. కాగా ఈ నెల 17 నుంచి 19 వరకూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## నేడు ఎయిర్‌పోర్ట్‌లో యాత్రి సేవా దివస్

విమానాశ్రయ డైరెక్టర్ శ్రీకాంత్



కోరుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో ఈ నెల 17న యాత్రి సేవా దివస్-2025ను నిర్వహించనున్నట్టు విమానాశ్రయ డైరెక్టర్ ఎస్‌కే శ్రీకాంత్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నాయి. మంగళవారం ఉదయం రాజమండ్రి ఎయిర్‌పోర్టు పరిపాలన భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఏఏఐ తీసుకుంటున్న చర్యలను ప్రతిబింబించేలా ఈ దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈ సందర్భంగా విమానాశ్రయంలో సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, అతిథి సత్కారం, అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పెడ్ మా కే నామ్) నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించనున్నట్టు డైరెక్టర్ తెలిపారు.ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం యాత్రి సేవా దివస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

## బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


కొత్తపట్నం వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం



కొత్తపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద అలల ధాటికి కోతకు గురైన రక్షణ గట్టుకు, బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు రక్షణగా గతంలో ఏర్పాటుచేసిన బండరాళ్లు, బీచ్‌రోడ్డు కోతకు గురవడం విధితమే. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద సైజు బండరాళ్లను కొత్తపట్నం తరలించి తాత్కాలికంగా కోత నివారణకు చర్యలు చేపట్టారు. అలాగే కొత్తపట్నం, సుబ్బంపేట వద్ద రోడ్డుకు ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

## రూ.4వేల కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ముంపు గ్రామాల్లో సభలు పెట్టాలి.. ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు


సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు రూ.4 వేల కోట్లు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్టీ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా గృహనిర్మాణాలకు భూసేకరణ చేసిన జిల్లా కలెక్టర్లపై కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు.ప్యాకేజీ చెల్లించే వరకు నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదన్నారు. జీలుగుమిల్లి పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీనిపై గ్రామ సభలో చేసిన తీర్మానాన్ని గౌరవించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలలో అక్టోబర్ 3న గ్రామ సభలు నిర్వహించాలని కోరారు.సమావేశంలో మిడియం వెంకటస్వామి, పూనెం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి నిర్మాణాల కోసం డీపీఆర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అన్నవరం, రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సెక్షన్ పరిధిలో నాలుగు లైన్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్-16) నిర్మాణాల కోసం డీపీఆర్ రూపకల్పన చేస్తున్నారు. దీన్ని ఆమోదించడానికి కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు కాకినాడ డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వెలువరించారు. సమావేశానికి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాస్త్రి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ప్రభుత్వం పెండింగ్ డీఏలను మంజూరు చేయడంతోపాటు 30% ఐఆర్‌ని ప్రకటించి పీఆర్సీ కమిషన్‌ని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం జిల్లా ఆపస్ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా మండల విద్యాశాఖాధికారుల(ఎంఈవో) బదిలీలు నిర్వహించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎంఈవో కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు కూడా 22 ఏళ్లుగా ఒకే చోట ఉండిపోయారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. వీరందరికీ మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయడంతో పాటు బదిలీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంల పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు.

## నాప్‌కిన్ డిస్పెన్సర్ల ఏర్పాటుకు కొటేషన్లు ఆహ్వానం

ఉమ్మడి తూర్పుగోదావరి పీడీజే సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 15 కోర్టు సముదాయాల్లోని వాష్‌రూముల్లో శానిటరీ నాప్‌కిన్ డిస్పెన్సింగ్ యంత్రాలు, వినియోగం తర్వాత ధ్వంసం చేసే పరికరాల(ఇన్సినరేటర్) ఏర్పాటు, నిర్వహణకు 119 యూనిట్ల సరఫరా కోసం అనుభవం ఉన్న ఏజెన్సీల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. సీల్డ్ కవర్‌లో ఈ నెల 30వ తేదీలోపు తమకు కొటేషన్లను అందజేయాలన్నారు. అలాగే జిల్లా కోర్టుల ఆవరణలో ఉన్న రెండు ఎండిన వేప చెట్లను తొలగించడానికి ఈ నెల 25న సాయంత్రం 4.30గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

# మోటార్ సైకిళ్లే టార్గెట్..

● ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పట్టుకున్న పెరవలి పోలీసులు

● రూ.40 లక్షల విలువైన 26 బైక్‌ల స్వాధీనం

పెరవలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లను చోరీ చేసిన ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పెరవలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 26 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. తుమ్మగంటి ధనుష్ (తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి), విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, అబ్బిరెడ్డి పాపారావు (కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి)లు కలిసి బైక్ చోరీలకు పాల్పడేవారు. వారి ముగ్గురిని చూసి ధనుష్ తమ్ముడైన నెక్కంటి యువరాజ్ కూడా దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలనుకుని వనచర్ల శక్తిరాజు, కూనపరెడ్డి వీరబాబు(ఖండవల్లి)తో కలిసి మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారు దొంగిలించిన మోటారు సైకిళ్లన్నీ వారి ఇళ్ల వద్ద పెట్టుకుని ఒక్కసారిగా అమ్ముదామనుకున్నారని డీఎస్పీ తెలిపారు. వారిలో ఐదుగురిని ఖండవల్లి వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. కేసు విచారణలో పెరవలిలో 4, ఉండ్రాజవరంలో 1, రాజమండ్రిలో 6, బొమ్మూరులో 1, పెనుగొండలో 3, పెనుమంట్రలో 2, ఇరగవరంలో 1, రావులపాలెంలో 3, ప్రత్తిపాడులో 2, సామర్లకోటలో 2, తునిరూరల్‌లో 1, విశాఖ జిల్లా ఆనందపురంలో 1, ఎంవీపాలెంలో 1 కేసులు నమోదు కాగా మొత్తం 26 మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు తేలిందన్నారు. వాటిలో సుజుకీ మోటారు సైకిళ్లు 15, రాయల్ ఎన్‌ఫీల్డ్ 6, పల్సర్‌బైక్‌లు 4, హెచ్‌ఎఫ్ డీలక్స్ 1 ఉన్నట్టు చెప్పారు. మొత్తంలో 25 కేసుల్లో ఐదుగురు దొంగలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.40లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. ఖండవల్లికి చెందిన మోతరపు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ట్రైనీ ఎస్‌ఐ కె.సౌజన్య, పోలీసుస్టేషన్ సిబ్బంది కె.శ్రీహరి, నరేంద్ర, ముత్యాలు, గంగాధరరావు, ప్రసాద్, రమేష్, హనుమంతు, శ్రీను, పవన్, సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, జి.అనిల్‌ను ఎస్పీ అభినందించినట్టు, వారికి రివార్డులు ఇస్తున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు.



పెరవలిలో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ, నిడదవోలు సీఐ, పెరవలి ఎస్‌ఐ, ట్రైనీ ఎస్‌ఐ

● సర్పవరంలో యువకుడి అరెస్ట్

● 11 బైక్‌లు స్వాధీనం



సర్పవరంలో నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి 11 వాహనాలను సర్పవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వివరాలను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు మంగళవారం విలేకర్లకు తెలిపారు. బైక్ చోరీల నివారణ, చోరీ సొత్తు స్వాధీనం కోసం కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎ స్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో సీఐ పెద్దిరాజు ఆధ్వర్యంలో నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామానికి చెందిన పెంకే తేజ(20) బైక్ చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి మంగళవారం సర్పవరం ఎస్‌ఐ పి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్ట్ చేశారు. నిందితుడు ఎత్తుకుపోయిన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ పెద్దిరాజు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, కానిస్టేబుల్స్ రవి, శ్రీనివాస్, అనిల్, చిన్నబాబు, కిషోర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ధర్మవరం హైవేపై ఘటన



మృతిచెందిన నాగేశ్వరరావు



ప్రమాదానికి కారణమైన లారీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. కాకినాడ జిల్లా తొండంగికి చెందిన కడారి నాగేశ్వరరావు, వేముల శ్రీను ప్రత్తిపాడు మండలంలో ఓ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నారు. 10 రోజులకు ఒకసారి తమ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి మళ్లీ చెరువు వద్దకు వస్తుంటారు. ఈ క్రమంలో తొండంగి వెళ్లిన నాగేశ్వరరావు, శ్రీను స్కూటీపై మంగళవారం ప్రత్తిపాడుకు బయల్దేరారు. ధర్మవరం సత్తెమ్మతల్లి గుడి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి తుని నుంచి రాజమండ్రి వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో కడారి నాగేశ్వరరావు(39)అక్కడికక్కడే మృతిచెందగా, వేమల శ్రీను గాయపడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. తమకు దిక్కు ఎవరంటూ రోధించారు. గాయపడిన రేమాల శ్రీను ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

అన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగింది. అన్నవరంలో వెలంపేటకు చెందిన బర్ల సోమరాజు (40) గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఒక లేఅవుట్‌లో ఇంటికి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేద్దామని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కరెంట్ స్తంభం ఎక్కాడు. అక్కడ వైర్ పట్టుకోవడంతో వెంటనే షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమయంలో అక్కడ దగ్గర్లో ఉన్న దేవస్థానం సబ్‌స్టేషన్ ట్రిప్ అయినట్టు ఏఈ తెలిపారు. అన్నవరం ఎస్‌ఐ హరిబాబు, ఎలక్ట్రికల్ ఏఈలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.



సోమరాజు (ఫైల్)

# పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్

స్వల్పగాయాలతో బయటపడిన ఐదుగురు జట్టు కార్మికులు

కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఘటన

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద కాంక్రీటు మిల్లర్‌తో కూడిన టాటా ఏస్ వాహనం మంగళవారం అదుపుతప్పి పంటకాల్వలోకి దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్తపేట మండలం పలివేల గ్రామానికి చెందిన కాంక్రీటు పనిచేసే జట్టు కార్మికులు పనినిమిత్తం రాజోలు మండలం జగ్గన్నపేట వెళ్లారు. పని ముగించుకుని తిరిగివచ్చే క్రమంలో మొండెపులంక వచ్చే సరికి అదుపు తప్పి పక్కనే పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురు జట్టు కూలీలు స్వల్పగాయాలతో బయటపడగా కాంక్రీటు మిల్లరు, టాటా ఏస్ వాహనం పూర్తిగా మునిగిపోయాయి. స్థానికుల సాయంతో వాహనాలను, కాంక్రీటు పనులకు వినియోగించే ఇనుప నిచ్చెనలను బయటకు తీశారు. అలాగే పలువురు సెల్‌ఫోన్‌లు సైతం నీటిలో మునిగిపోయినట్టు బాధితులు పేర్కొన్నారు.



మొండెపులంక వద్ద పంటకాల్వలోకి దూసుపోయిన టాటాఏస్, కాంక్రీటు మిల్లరు

# రైతుల బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మలికిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి తీర ప్రాంత గ్రామాల్లోని రైతులు పడుతున్న బాధలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలోని తుఫాన్ సెంటర్ భవనంలో రైతులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు సస్యశ్యామలంగా ఉండే తీర ప్రాంతంలో కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం తదితర గ్రామాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో శంకరగుప్తం డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి రైతులకు అపార నష్టం కలుగుజేస్తున్నాయని, శాశ్వత పరిష్కారాలు ప్రభుత్వాలు చూపకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు సోము దృష్టికి తీసుకువచ్చారు. సోము మాట్లాడుతూ ఈప్రాంత సమస్యను స్వయంగా చూశానని, కొబ్బరిచెట్లు చనిపోవడం తీవ్రంగా కలచివేస్తుందని, స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసెంబ్లీలో ప్రస్తావిస్తారని తెలిసిందని, తాను కూడా శాసనమండలిలో ప్రస్తావించి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానన్నారు. కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్,మండలాధ్యక్షుడు మేడిచర్లచాణుక్య ఉన్నారు.



కేశనపల్లిలో కొబ్బరిచెట్లను పరిశీలిస్తున్న సోము

కోర్టు ఆదేశాల ధిక్కరణ..

# పంచాయతీ కార్యదర్శికి వారం రోజులు జైలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీకి వారం రోజులు జైలు శిక్ష విధించింది. ఆ శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈనెల 17న కోర్టుకు హాజరుకావాలని కార్యదర్శిని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గున్నేపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన ముత్తాబత్తుల సత్యనారాయణ తాను తక్కువ కులం వాడిని కావడంతో గ్రామంలో రాజకీయం చేసి తమ ఇంటి ఎదురుగా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు చేపడుతున్నట్టు ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రిట్‌పై టి.రాజశేఖర్ ధర్మాసనం అన్ని అంశాలను పరిశీలించి ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులను ధిక్కరించి అదే ప్రాంతంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈనెల 15న కోర్టు ఉత్తర్వుల ధిక్కరణపై న్యాయవాది మనోజ్ కంటెంప్ట్ ఆఫ్ ది కోర్టు పిటిషన్‌పై దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీని వారం రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది. జైలు శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈ నెల 17న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఇలా ఉండగా జలజీవన్ మిషన్ నిధులతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలువురు అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

# పంటకాల్వలో యువకుడి మృతదేహం లభ్యం



తాండవపల్లిలో లభ్యమైన మృతదేహం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాండవపల్లి గ్రామంలోని శెట్టిపల్లి పంటకాల్వలో మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్టు అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి ఉందని.. తెలుపు, నీలం రంగు షర్టుతో పాటు కుడిచేతి మీద దీపిక పేరుతో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తాలూకా ఎస్‌ఐ సెల్ 9440796562, తాలూకా సీఐ 9440796525కు సమాచారం అందించాలని కోరారు.

# స్వగ్రామానికి కోనసీమ మహిళ మృతదేహం



విజయ భారతి (ఫైల్)


మలికిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళ మృతదేహం 13 రోజులకు స్వగ్రామానికి చేరింది. మలికిపురం మండలం పెదతిప్ప గ్రామానికి చెందిన రాపాక విజయభారతి(56) నాలుగేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో స్పృహ కోల్పోయి యజమాని ఇంట్లో చనిపోయింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి కావాల్సిన కార్యక్రమాలను అక్కడే ఉంటున్న పెదపాటి సురేష్, నల్లి చిన్నా, నల్లి శృతి ఎంబసీ సహాయంతో పూర్తిచేశారు. మృతదేహాన్ని నల్లి శృతి దగ్గరుండి తీసుకురావడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకురావడానికి ఎటువంటి ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెన్స్ తెలుగు సొసైటీ ద్వారా నల్లి శంకర్ సహాయంతో స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహానికి రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివ నివాళులర్పించారు.

# రమణయ్యపేట - జె.అన్నవరం రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ఉన్న రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు దుస్థితిపై వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించి ఆదేశాలు ఇచ్చారు. వెంటనే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. నేషనల్ డవలప్‌మెంట్ బ్యాంక్ ధనంతో ఈ రహదారిని త్వరలో పునఃనిర్మిస్తారన్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రయాణికులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చేయాలని పవన్ సూచించారు. గుంతలు లేని రహదారులు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం సామాజిక మాధ్యమంలో వివరించారు.

# 'ఏలేరు'లో పెరుగుతున్న నీటి నిల్వలు



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. గోదావరి జలాలు, మెస్తారు వర్షాలు రిజర్వాయర్‌లో వచ్చి చేరడంతో నీరు పెరుగుతోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1400 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 82.41 మీటర్ల స్థాయిలో 16.48 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు వంతులకు నీరు చేరుతోంది. దీంతో సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

# హత్య కేసులో దంపతులకు పదేళ్ల జైలు

పెద్దాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో భార్యభర్తలకు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించినట్టు పెద్దాపురం సీఐ పి.విజయశంకర్ తెలిపారు. 2022లో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఆదిన ప్రసాద్, అతడి భార్య లక్ష్మి సరిహద్దు తగాదా నేపథ్యంలో జరిగిన ఘర్షణలో పాలాని మంగను ఇంటి మెట్లపై నుంచి తోసివేయడంతో మృతిచెందింది. దీంతో మృతురాలి కుమార్తె కరెళ్ల పాపారత్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్‌ఐ వి.శివకుమార్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదోపవాదాలు జరిగి నేరం రుజువు కావడంతో నిందితులకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దీప దైవకృప 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గన్నంరాజు వినయ్ తేజ, రాగం కామేశ్వరరావు వాదనాలు వినిపించారు.

# చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది బీవీవీ సత్యనారాయణ రాజు అందించిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన గన్నేరు ఈశ్వరరావు వద్ద నాగులాపల్లికి చెందిన కేవీ రెడ్డి రూ.3.85లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనిపై అతడు ఇచ్చిన చెక్‌బౌన్స్ కావడంతో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేయగా 2022లో 6నెలల జైలు శిక్ష, అప్పు చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. దీనిపై కేవీ రెడ్డి జిల్లా కోర్టులో అప్పీలు చేయగా కింద కోర్టు తీర్పునే ఖరారు చేసింది.

# రైలు నుంచి జారి పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గరికిన హేమన్ రాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు నుజ్జునుజ్జుయ్యాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న హేమన్‌రాజు రోజూ తుని నుంచి రైల్లో సామర్లకోట వరకు వెళ్లి అక్కడ నుంచి కళాశాలకు వెళ్తుంటాడు. మంగళవారం రద్దీ ఎక్కువగా ఉండడంతో రైలు ఎక్కే క్రమంలో కిందకు జారిపడ్డాడు. అతడి కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సిఫార్సు మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించినట్టు రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.



రైస్‌మిల్లర్‌కు బెదిరింపులు..

# పి.గన్నవరంలో అధికారుల విచారణ

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి రైస్ మిల్లర్‌ను బెదిరించి దందాకు పాల్పడిన ఘటనపై సివిల్‌సప్లయి అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్షయ రైస్ మిల్లు వద్దకు వారంక్రితం ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి ప్రత్యేక వాహనంలో నలుగురితో కలిసి వచ్చాడు. మిల్లులోకి వెళ్లి రేషన్ బియ్యం పక్కతోవ పడుతున్నాయని, లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించి రూ.8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మిల్లు యజమాని రూ.1.50లక్షలు ఇవ్వడంతో సదరు వ్యక్తి అనుచరులతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈవిషయం ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి.శ్రీనివాస్, ఎంఎస్‌వోలు ఎండి ఇస్మాయిల్, పూర్ణిమ, భారతి మిల్లు వద్దకు వెళ్లి స్టాక్ రిజిష్టర్లు, స్టాకు పరిశీలించారు. ఘటనపై మిల్లు యజమానితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయమై శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని నివేదికను అధికారులు అందిస్తామని వివరాలు వారే వెల్లడిస్తారని తెలిపారు.

# ఆటోను ఢీకొన్న లారీ

ఇంటి మీదకు వెళ్లిన వైనం

నలుగురికి గాయాలు



ఇంటి మీదకు వెళ్లిన ఆటో

ఎటపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటోని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆటో ఓ ఇంటి మీదకు వెళ్లగా నలుగురికి గాయాలైన సంఘటన మంగళవారం ఎటపాక మండలం బండిరేవు వద్ద జరిగింది. గౌరిదేవిపేట గ్రామానికి చెందిన డయాలసిస్ రోగిని చింతూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లి ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో బండిరేవు వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంటి మీదకు వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ డి.రామారావుతోపాటు ఇద్దరు ప్రయాణికులు, డయాలసిస్ రోగికి గాయాలయ్యాయి.

# మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

రంపచోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం గంగవరం మండలంలో దాడులు నిర్వహించి 10 మద్యం బాటిళ్లతో వీర వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సారా కేసుల్లో నిందితులుగా ఉన్న 8 మందిని అరెస్టు చేశామన్నారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

ఆయిల్ దొంగతనానికి యత్నం

# నలుగురి అరెస్ట్

కేసు నమోదు

తొండంగి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు సమీపంలో సోమవారం రాత్రి ఐవోసీఎల్ పైపులైన్ నుంచి ఆయిల్ దొంగతనానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం తొండంగి పోలీస్‌స్టేషన్‌లో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నలుగురు గునపాలు, పారలు పట్టుకుని పైపులైన్ వద్ద మట్టి తవ్వుతుండగా వాహనాలు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం తెలుసుకుని ఐవోసీఎల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా నలుగురు వ్యక్తులు ఈ సంఘటనలో ఉన్నట్టు గుర్తించామన్నారు. చక్కా శంకర్, రచ్చ భాగరాజు, కర్రి కేశవ్, దడాల ఆంజనేయులను అరెస్టు చేసి విచారించామన్నారు. వారిలో శంకర్, భాగరాజులపై సమీప పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. నలుగురిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఎస్‌ఐ జగన్మోహన్ ఉన్నారు.

మనస్తాపంతో

# హిజ్రా ఆత్మహత్య



జాస్మిన్ (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ హిజ్రా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ తూరంగిలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన హిజ్రా జాస్మిన్ (19) కొద్ది రోజుల క్రితం ఓ అబ్బాయిని ప్రేమించింది. అయితే అతడికి జాస్మిన్‌తో విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విలువలతో లక్ష్యాలను చేరుకోవాలి

### నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జ్ఞానం, నైపుణ్యం మాత్రమే విజయాన్ని నిర్వచించవని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. సమగ్రత, నిజాయితీ, కరుణ, బాధ్యతయుత భావన వంటి విలువలతో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నన్నయ వర్శిటీలో ఇంజనీరింగ్ కళాశాల, సైన్స్, హ్యూమనిటీస్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ ఫస్టియర్ విద్యార్థులకు దీక్షారంభ్ ఇండక్షన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ బాధ్యతతో కూడిన స్వేచ్ఛ మెరుగైన జీవితాన్ని ఇస్తుందన్నారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యలో అభ్యాసానికి ప్రాధాన్యమివ్వాలని, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, ప్రయోగశాలలు, గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడపాలన్నారు. ప్రతీ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఇంజనీరింగ్ చదువుతున్న తన కుమారుడు సిద్ధూను తాను పోగొట్టుకుంటే దేవుడు వేలాది మంది పిల్లలను ఇచ్చాడని, అందరూగొప్ప ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీక్షారంభ్ కార్యక్రమం వారం రోజులు జరుగుతుందని తెలిపారు.

## దళితుల రిజర్వేషన్ శాతాన్ని పెంచండి

### వర్గీకరణ రద్దు చేయండి..రాక్స్ అండ్ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, మాల మాదిగ ఉపకులాలు అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోదీ తక్షణమే రిజర్వేషన్ శాతాన్ని పెంచి అమలుచేయాలని రాక్స్ అండ్ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మొట్టమొదటి సారిగా పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో చేసి బీజం వేసిందని కాంగ్రెస్ ప్రభుత్వమేనని, దానిని దేశం మొత్తానికి ప్రధాని మోదీ ఆపాదించారని ధ్వజమెత్తారు. మోదీకి చేతనైతే దేశంలో ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని మరో 10శాతం పెంచాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి పునరాలోచన చేసి వర్గీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గోడపాటి వెంకటేశ్వరరావు, కీర్తి నాయుడు, చిత్తూరు సుమన్, కొప్పల ప్రేమ్‌బాబు, నెల్లి సూరిబాబు, నూతాటి గౌతం, మర్రి పుష్పరాజు పాల్గొన్నారు.

## వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

### డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం వద్ద ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం ఎదుట వీవోఏలు ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ పీడీ సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు మద్దతుగా పవన్ మాట్లాడుతూ ఆన్‌లైన్ పనులు చేయడం లేదని సిబ్బందిని వేధించడం తగదని, 5జీ మొబైల్ ఇవ్వకుండా ఇది ఎలా సాధ్యమని అన్నారు. బకాయి ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని ఈ సందర్భంగా వీవోఏలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవిస్వరూపరాణి, మహిళలు, నాయకులు శిరీష, గణిక, వేబీ, వివిధ మండలాల నుంచి వీవోఏలు పాల్గొన్నారు.



## వైసీపీ పాలనలో చాగల్నాడు నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి(రంగంపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకాలను పట్టించుకోవపోవడంతో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2014-19 కాలంలో ఎత్తిపోతల పథకాలకు కోట్ల రూపాయలు మంజూరు చేశామని, వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులపై దృష్టి సారించామన్నారు. ఫెర్టిలైజర్స్ వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించే విధంగా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామాంజనేయులు ఆధ్వర్యంలో వివిధ శాఖల ప్రగతిని అధికారులు సభకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాలయ సత్యనారాయణ, ఆత్మా కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా..కేంద్ర ప్రభుత్వం

### రంగంపేట, బిక్కవోలు మండల పరిషత్ సమావేశాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి

ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభి యాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు. ఈ మేరకు అనపర్తి మండలం రామవరంలోను, రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలోను జరిగిన కార్యక్రమాల్లో ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు.

### పంచాయతీలకు రూ.1.16 కోట్లు

బిక్కవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపవరం వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె.సత్యవేణి జీపీఏ సాధనలో రాష్ట్రంలో ప్రథమంగా నిలిచిన సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. పంచాయతీలు 15వ ఆర్థిక సంఘ నిధులు ఖర్చు పెట్టుకునేందుకు వీలు కల్పించామని, మండలంలోని పంచాయతీలకు రూ.1.16 కోట్లు నిధులు వచ్చాయని, మండల పరిషత్‌కు కూడా రూ.7 కోట్ల వరకూ సమకూరాయన్నారు. ప్రజా ప్రతినిధులందరికీ పార్టీలకు అతీతంగా ప్రొటోకాల్ పాటిస్తున్నామన్నారు. బిక్కవోలు-అనపర్తి కెనాల్ రోడ్డును రూ.7 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. సభలో నూతనంగా ఎంపికైన కొమరిపాలెం, కొంకుదురు ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు ద్వారంపూడి వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డిలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి టి.శ్రీదేవి, తహశిల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### జేవీవీ రాష్ట్ర పర్యావరణ కమిటీలో చిలుకూరి

కడియం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ కమిటీకి ముగ్గురు సభ్యుల బృందాన్ని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎస్ లక్ష్మణరావు, టి.సురేష్ మంగళవారం ప్రకటించారు. వారిలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావు కో కన్వీనర్‌గా ఎంపికయ్యారు.

## పరిశోధనలు, ఫార్మాలో అవకాశాలు మెండు

» ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఫార్మా సదస్సులో వక్తలు
» ప్రపంచ ఓజోన్ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, ఫార్మా రంగంలో యువతకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఎవరెస్ట్ ఆర్గానిక్స్ కన్సల్టెంట్ ఏ.వీరారెడ్డి, ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ పి.మంగళ గౌరీ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా అకాడమియా-ఫార్మా సమన్వయం : సుస్థిర భవిష్యత్తు కోసం సేంద్రీయ సంశ్లేషణ, ఔషధ ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య, నాట్కో ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాస్, నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ జగన్మోహనరెడ్డి, టెక్సాస్ క్రిస్టియన్ యూనివర్శిటీ రీసెర్చర్ హర్ష తదితరులు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు పరిశోధకులు, విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతాయని అన్నారు. ఈ సందర్భంగా పరిశోధనాపత్రాలతో కూడిన సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ రసాయనశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, కళాశాల వాణిజ్య, నిర్వహణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎక్సలెన్స్ అండ్ సస్టయినబిలిటీ బై డిజైన్ థింకింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎడ్యుకేటర్ కె.నాగిరెడ్డి ప్రధాన ఉపన్యాసం చేశారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే అధ్యక్షతన హెచ్‌వోడీ పీవీవీ సత్యనారాయణ, కన్వీనర్ రమేష్‌కృష్ణ, కో కన్వీనర్ సునంద ఈ సదస్సు నిర్వహించారు.



## బొజ్జా తారకం వర్ధంతి

కడియం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పొట్టిలంక కమ్యూనిటీ భవనం ఆవరణలో మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బొజ్జా తారకం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తారకం చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నంరాజు, బడుగు సత్తిబాబు, నక్కా చంటిబాబు,బడగు సుధాకర్, నక్కా ఆనంద్,గుమ్మడి అర్జున్ పాల్గొన్నారు.

## జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ 2026 ఆగస్టులో జరుగబోయే వందేళ్ల వేడుకలకు రూ.900 కోట్లు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నూతన డిపాజిట్ స్కీమును ప్రవేశపెడతామన్నారు. కార్యక్రమంలో ఖాతాదారులు, డిపోజిటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు కండక్టర్‌పై ప్రయాణికుడు దాడి

### విరిగిన వేలు.. ఆసుపత్రికి తరలింపు.. చిల్లర విషయమై వాగ్వాదం

గోకవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చిల్లర విషయంలో కండక్టర్‌కు, ప్రయాణికుడి మధ్య జరిగిన వివాదంలో కండక్టర్ వేలు విరిగింది. స్థానికులు, ఆర్టీసీ కార్మికుల వివరాల ప్రకారం.. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన సింగిల్ స్టాప్ బస్సు రాజమహేంద్రవరం బయలుదేరింది. గోకవరంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన ఎం.రామకృష్ణ బస్సు ఎక్కాడు. గోకవరానికి టిక్కెట్ ఇమ్మని చెప్పి కండక్టర్ జి.పాండురంగకు రూ.105 ఇచ్చాడు. దీంతో టిక్కెట్‌తో పాటు ఇచ్చిన డబ్బుల్లో రూ.10 నోటు చిరిగిపోయిందంటూ రామకృష్ణ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో రామకృష్ణ.. కండక్టర్‌పై దాడి చేయడంతో కుడి చేతి చిటికెన వేలు విరిగింది. దీంతో గోకవరం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై గోకవరం పోలీసులకు బాధితుడు పాండురంగ ఫిర్యాదు అందించినట్టు సమాచారం.

## ములకల్లంక సొసైటీలో విజిలెన్స్ తనిఖీలు

సీతానగరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకల్లంక సొసైటీలో మంగళవారం విజిలెన్స్ సీఐ మధుబాబు రికార్డులను తనిఖీ చేశారు. ములకల్లంక సొసైటీకి రెండు రోజుల క్రితం పది టన్నుల యూరియా రావడంతో దానిని రైతులకు పంట నమోదు ఆధారంగా అందించారా? ఎన్ని బస్తాల చొప్పున అందించారనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందించిన స్లిప్‌లను ఆధారం చేసుకుని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో ఎ.గౌరీదేవి, సీతఈవో ఉండవల్లి శ్రీనివాసరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### పందిరి మహదేవుడు సత్రానికి
## ధర్మకర్త మండలి సభ్యుల నియామకం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిలింగాలపేటలోని పందిరి మహదేవుడు సత్రానికి ఎండోమెంట్స్ సహాయ కమిషనర్, ఈవో వి.విశ్వనాథరాజు ఉత్తర్వుల మేరకు ధర్మకర్త మండలికి 11 మంది సభ్యులను నియమించారు. రెడ్డి మణీశ్వరరావు, గొర్రెల వీరవెంకట సత్యమణి, తుల్లి పద్మావతి, యామల లక్ష్మి, గంటా పార్వతి,సలాది ఆనంద్, తాడి దుర్గాప్రసాద్, గండేబత్తుల వెంకట రామకృష్ణ, కాకరాల పవన్‌కుమార్, యందం ఇందిర, ఎన్‌వీవీ శివనారాయణలను సభ్యులుగా నియమించినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## పారిశుధ్యాన్ని మెరుగుపరచండి

ధవళేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే అన్నట్లుగా ఉంటోందని మరింత మంది పారిశుధ్య కార్మికులను నియమించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతూ సీపీఎం నాయకులు పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని కొద్దిపాటి వర్షానికే వీధులు జలమయమవుతున్నాయన్నారు. అలాగే గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న భారీ వాహనాల నుంచి ఇసుక జారి పడడం వల్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ, పడాల రామకృష్ణ, ఎస్ఆర్ మోహన్, వి.పేరయ్య లింగం, బీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.







## వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోండి

రాజానగరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వాహనమిత్ర పథకానికి అర్హులైన ఆటో డ్రైవర్లంతా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అర్హులైన ఆటోడ్రైవర్లు ఆయా గ్రామాల్లోని సచివాలయానికి వెళ్లి వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

బిక్కవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెం గ్రామంలోని కాలువ రేవులో మంగళవారం సాయంత్రం రెండు గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి.యజమాని కాళ్ల వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాలువలో విద్యుత్ వైర్లు తెగి పడి వున్నాయని అయితే గేదెలు నీటి కోసం దిగడంతో విద్యుత్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయన్నాడు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. అయితే ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, విద్యుత్ వైర్లు తెగినా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## యువకుడి అదృశ్యంపై కేసు

అనపర్తి(రంగంపేట) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం పాత వీరంపాలెం గ్రామానికి చెందిన యువకుడు నల్లమోలు బాల తేజ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. బాలతేజ ఈ నెల 15వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని బైక్‌పై వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇంట వెదికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.బాల తేజ తండ్రి దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 17 సెప్టెంబరు 2025 | 5





## జీవీపీలో సత్యవాణి!

కష్టే ఫలి అన్నారు పెద్దలు.. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందనేది అర్థం.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె.సత్యవేణి జీవీపీ సాధనలో రాష్ట్రంలో ప్రథమంగా నిలిచింది.. అమరావతిలో సీఎం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆమె పేరు మారుమ్రోగింది. ఈ మేరకు బిక్కవోలు మండల పరిషత్ తరఫున ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మంగళవారం ఆమెను సత్కరించారు. - బిక్కవోలు




## పది ఫెయిలై.. చోరీల బాటపట్టారు!

ఆ ఐదుగురు యువకులే.. పదవ తరగతి ఫెయిలైపోయారు.. జల్సాలకు అలవాటు పడిపోయారు.. ఈజీ మనీ కోసం వేట ఆరంభించారు.. బైక్‌ల దొంగతనాలను వృత్తిగా మలచుకున్నారు.. ఒకటా రెండా ఏకంగా 26 బైక్‌లు, స్కూటర్లను కొట్టేశారు.. ఇటీవల తనిఖీల్లో ఒక యువకుడు పెరవలి పోలీసులకు చిక్కగా తీగలాగారు.. డొంక కదిలింది.. ఉభయగోదావరి జిల్లాలతో పాటు.. వైజాగ్‌లోనూ చోరీలకు తెగబడినట్టు తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఐదుగురిని కటకటాల్లోకి పంపారు.

## ఓహోజోన్!



ఇదేంటో చెప్పా.. ఆకారం చూస్తే 0 3లా ఉంది.. అంటే ఏంటో తెలుసా.. ఓజోన్ అని అర్థం.. బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఓ3 ఆకారంలో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలోచింపజేశాయి.
- బిక్కవోలు



## రాజమహేంద్రవరం రూపురేఖలు మారుస్తా!

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం.. నాకో ప్రణాళిక ఉంది.. నా ప్లానింగ్‌కు పుష్కరాలు ఒక అవకాశం. ఎందుకంటే నిధుల కొరత ఉండదు. ఇప్పటికే సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నా..చారిత్రిక రాజమహేంద్రవరాన్ని మరింత సౌకర్యవంతంగా, సుందరంగా తీర్చిదిద్దుతానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో అభివృద్ధిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో కాసేపు ముచ్చటించారు. కేవలం ఏడాదిలోనే సుమారు రూ.190 కోట్ల అభివృద్ధి పనులు చేశానన్నారు. ఈ ఏడాది మరో రూ.130 కోట్లతో నల్లాఛానల్ మురుగు పోవడానికి మరో మార్గం సిద్ధం చేసి గోదావరిలో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీల సమస్య పరిష్కరించడంతో పాటు పార్కుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నానన్నారు. బత్తినగర్‌లో రూ. 60 లక్షలతో సంపు కమ్ పంపు హౌస్ నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. నగరంలోని 50 డివిజన్లలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. పలు జం క్షన్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు.రివర్‌ఫ్రంట్ పనులు వేగవంతం అయ్యాయని, అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా పుష్కరఘాట్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని,హేవలాక్ బ్రిడ్జిని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే పనులు త్వరలో మొదలుకానున్నాయన్నారు. పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం రూపు రేఖలు మారుస్తానన్నారు.

# జిల్లాలో అశాంతి.. అభద్రత వద్దు!



### కలెక్టర్, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు

అమరావతిలో మంగళవారం రెండో రోజు జరిగిన కలెక్టర్, ఎస్పీల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతం చేయడంతో పాటు జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సమీక్షించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లాలో ఎవరైనా కలెక్టర్ ఒక ప్రాజెక్టు చేపట్టి ప్రశంసలు అందుకుంటే దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో ఎస్పీలు రాజీపడకుండా సమర్థవంతంగా సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మహిళల పట్ల అత్యాచారాలు, పిల్లల కిడ్నాప్‌లు, గంజాయి మత్తులో యువత చేస్తున్న అరాచకాల వంటి అంశాలపై జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా అంతా పనిచేయాలి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం దారుణంగా నష్టపోయింది. వృద్ధి రేటుపై పనిచేయడంతో పాటు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు మానవ వనరులను సమృద్ధిగా ఉపయోగించాలన్నారు. నేను, పవన్‌కల్యాణ్ శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. 30 శాతం క్రైమ్ రేటును తగ్గించే విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు పనిచేయాలని, సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త నినాదంతో ముందుకెళ్లాలని సీఎం ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా అధిక నీటి పారుదల సామర్థ్యం ఉంది. లైవ్ స్టాక్ ఉత్పత్తి ఉంది. ఆయిల్‌పామ్, వరి, కోకో వంటి అతి విలువైన పంటల సాగు ఉంది. జిల్లాలో 38 పరిశ్రమలు ఉన్నాయి. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కొత్త కార్గో టెర్మినల్ నిర్మాణం కూడా జిల్లాకు బలమేనని స్పష్టం చేశారు. బలహీనతలు అంటే జిల్లాలో సాంప్రదాయ పంటలను పరిమిత రకాలతోనే పండిస్తున్నారు. నీటిపారుదల పద్ధతులు పేలవంగా ఉన్నాయి. నేల సంరక్షణ తీరు బలహీనంగా ఉంది. పంటలు కోసిన అనంతరం వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు లేవని తేల్చారు.

#### మరణాల రేటు 11 శాతం

జిల్లాలో చదరపు కిలోమీటరుకు 716 మంది జనసాంద్రత ఉన్నట్టు లెక్క తేల్చారు. మరణాల రేటు 11 శాతంగా ఉంది. 2023-24లో ఇండియాలో మరణాల రేటు 7.42 శాతం ఉండగా, ఆంధ్రలో 6.3 శాతంగా ఉంది. కానీ జిల్లాలో 11 శాతంగా ఉందని నివేదిక తేల్చింది. తలసరి ఆదాయం రూ.2,55,650గా ఉంది.20 28-29కి రూ.5,21,778గా 2047-48కి రూ.50,67, 816గా పెంచాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇండస్ట్రియల్, సర్వీసు రంగాల ద్వారా 2023-24లో రూ.56, 468 కోట్లు ఆదాయం రాగా 2028-29కి రూ.1,15,539 కోట్లు, 2047-48కి రూ.10,19,903 కోట్ల లక్ష్యంగా నిర్ణయించారు.

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యం కావాలి
- పథకాలు వేగవంతం చేయాలి
- 15 శాతం వృద్ధి రేటు ఉండాలి
- ఎస్పీలు రాజీపడొద్దు
- పోలీసులు అప్రమత్తం కావాలి
- సాగు విధానంలో మార్పు రావాలి
- విమానాశ్రయంలో కార్గో టెర్మినల్

#### పంటల సాగు మార్చండి..

జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో చేల గట్ల మీద కందిపంట సాగు ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. 77,820 హెక్టార్ల సాగుకు అనుకూలంగా ఉండాలని నిర్ణయించారు. మినుములు 2595 హెక్టార్లు, పెసలు 1000 హెక్టార్లు, వేరుశనగ 258 హెక్టార్లు, కాటన్ 502 హెక్టార్లు సాగు చేయాలని నిర్ణయించారు. 4970 హెక్టార్లలో హార్టికల్చర్ పంటను ప్రోత్స హించే లక్ష్యంతోఉన్నారు. ఆర్కిడ్స్, కలర్ క్యాప్సికమ్, ఆఫ్ సీజన్ టమోటాలను 4 వేల హెక్టార్లలో సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకు న్నారు. డ్రాగన్, అవకాడో వంటి ఫ్రూట్స్ 10 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించారు. ఈసదస్సులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహకిశోర్ పాల్గొన్నారు.

## అవినీతిని తిరగదోడారు!

### 8 మంది అధికారులపై విచారణకు సిఫారసు

- ప్రైవేట్ వెంచర్‌లో వివాదం
- ప్రభుత్వానికి 5.82 కోట్లు నష్టం
- చాలా కాలం తర్వాత చర్యలు
- వీరిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసినా అవినీతి వెంటాడుతూనే ఉంటుంది. తమ హయాంలో జరిగిన తప్పుకు ఎప్పుడైనా సమాధానం చెప్పాల్సిందే. రాజానగరం మండలం పరిధి ఎస్‌బీ వెంచర్స్‌లో సామాజిక స్థలం (ఓపెన్ స్పేస్) తక్కువ విలువ చూపించి గతంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ పలువురు అధికారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్,రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖల అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ఆర్టికల్స్ ఆఫ్ చార్జ్ ఫ్రేమ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీని వల్ల ప్రభుత్వానికి రూ.5.82 కోట్ల నష్టం చేకూరినట్టు పేర్కొన్నారు. రాజా నగరం మండలంలో అప్పటి అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లుగా విధులు నిర్వహించిన ఎం.ప్రసాదరావు, సీహెచ్.శ్రీనివాసబాబు, జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ఎం.శ్రీనివాసమూర్తి,ఆర్.సత్యనారాయణలతో పాటు రాజానగరం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన తోలేటి సుబ్రహ్మణ్యం, క్రొవ్విడి విజయభాస్కరరావు, పీఆర్.కృష్ణభగవాన్, ప్రస్తుత దివాన్ చెరువు పంచాయతీ కార్యదర్శి కూచిమంచి హనుమంతరావులపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం కాకినాడ జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

## మాకూ బస్ కావాలి!



- మారుమూల రూట్లకు డిమాండ్
- పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ
- సవాల్‌గా మారుతున్న స్త్రీశక్తి
- ఆర్టీసీ అధికారులకు కొత్త చిక్కులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి - మహిళలకు ఉచిత బస్సు పథకానికి రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోంది. మా ఊరికి బస్సు నడపండి .. మా ఊరికి బస్సు నడపండి అంటూ కలెక్టర్ పీజీఆర్ఎస్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కొవ్వూరు, నిడదవోలు మండలాలతో పాటు రాజానగరం, కడియం మండలాల్లోని మరికొన్ని గ్రామాల నుంచి కూడా ఇలాంటి వినతులు పెద్దఎత్తున వస్తున్నట్టు చెబుతున్నారు. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు డిపోలను ఆర్థిక, రాజకీయ కారణాలతో ఎత్తేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు మళ్లీ ఈ రెండు డిపోలను యథాతథంగా పునరుద్ధరించారు. అయితే గ్రామాల్లో తిరిగే చాలా సర్వీసులను రద్దు చేశారు. ఆదాయం వచ్చే రూట్లను కొనసాగించారు. దీంతో కొవ్వూరు, నిడదవోలు మండలాల్లోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడవడం లేదు. ఈ రెండు డిపోలు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి. ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో బస్సులు నడపాలంటూ ఆయా గ్రామాల నుంచి డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో స్త్రీ శక్తి రష్ భారీగా పెరిగింది. దీనికి అనుగుణంగా జిల్లా ఆర్టీసీ అధికారులు ఏ ఒక్క సర్వీసును రద్దు చేయకుండా నిర్ణీత షెడ్యూలు ప్రకారం బస్సులు తిప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా మరిన్ని డిమాండ్లు వస్తుండడంతో ఏం చేయాలో అర్థం కావడంలేదని అధికారులు వాపోతున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో ఉచిత బస్సు పథకం సాఫీగా అమలు చేయడం జిల్లా ఆర్టీసీ యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది.



పెద్దేవంలో పర్యటించి వివరాలు సేకరించిన పశు వైద్యాధికారులు

## పెద్దేవంలో గేదెలకు బి.కోలి, పొట్ట జలగ వ్యాధి

- ఇప్పటి వరకూ 9 గేదెలు మృతి
- 15 గేదెలలో వ్యాధి లక్షణాలు
- పశు సంవర్థక అధికారుల చికిత్స

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో వరసగా పాడె గేదెలు మృతి చెందడానికి కారణాలు ధ్రువీకరణ అయినట్టు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డా.టి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ బి.కోలీ, పొట్ట జలగ వ్యాధులతో 9 గేదెలు మృతిచెందాయన్నారు. వ్యాధి నిర్ధారణ కావడంతో చికిత్స కొనసా గిస్తున్నామన్నారు.కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. ఆగస్టు 24న మొదటిసారిగా పాడె గేదెల మెడ ఎడమవైపున తెల్లటి మచ్చలు రావడంతో రైతులు చికిత్స చేయించారన్నారు. మూడు నుంచి నాలుగు రోజులు చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో 9 గేదెలు మృతి చెందాయన్నారు. రైతుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే వైద్య బృందం పెద్దేవం గ్రామం చేరుకుని పరీక్షలు నిర్వహించగా 15 గేదెలకు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారన్నారు. గేదెల రక్తం, పేడ, గడ్డి, దాణా, నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపామన్నారు. పేడ పరీక్షలో బి.కోలి, పొట్టజలగ వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. దానికి అనుగుణంగా చికిత్స ప్రారంభించినట్టు పేర్కొన్నారు. కాకినాడలోని ప్రాంతీయ పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్ అధికారులు ఈ నెల 3న పెద్దేవం వెళ్లి అక్కడ గేదెల పరిస్థితిని, ఆ ప్రాంతాన్ని సందర్శించి నీటి నమూనాలు తీసి పరీక్షించారన్నారు.అందులో రెండు చోట్ల తక్కువ మోతాదులో హానికర రసాయనాలు ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు.ఈ నెల 13న విజయవాడ జీవశాస్త్ర పరిశోధన సంస్థ నిపుణులు పరిశీలించి వైద్య సూచనలు చేశా రన్నారు. గన్నవరంలోని శ్రీవేంకటేశ్వర వెట ర్నరీ విశ్వవిద్యాలయం విభాగాధిపతులు సోమవారం గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడి మరిన్ని నమూనాలు సేకరించారన్నారు. ఇప్పటికే బాధపడుతున్న గేదెలలో మూడింటి పరిస్థితి కొద్దిగా మెరుగుపడిందన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని..సిబ్బంది అందుబాటులో ఉన్నారని,ఎమర్జెన్సీ పరిస్థితి ఉన్నా కంట్రోలు రూమ్ నంబర్ 9951505099లో సంప్రదించాలన్నారు.

# కందని ధర!



### దిగజారిన కంద ధర

- సగానికి సగం తగ్గుదల
- గతేడాది క్వింటా రూ.12 వేలు
- ఈ ఏడాది రూ.6 వేలు
- పడిపోయిన ఎగుమతులు
- లబోదిబోమంటున్న రైతాంగం
- పెట్టుబడులు రావని ఆందోళన
- నెమ్మదించిన కంద తవ్వకాలు

పెరవలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంద ధర చూసి రైతు ముఖం కందబారిపోతోంది. ఏం చేయాలో తోచక తెల్లముఖం వేసుకుని చూస్తున్నాడు. ధర బాగుంటుందని సాగు చేస్తే సగానికి సగం ధర తగ్గడంతో దిగాలుగా ఉండిపోతున్నారు. పంటను అమ్మలేక.. దాయలేక సతమతమవుతున్నాడు. రేటు దిగజారిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది క్వింటా రూ.12 వేల పలికిన కంద ప్రస్తుతం రూ.6 వేలకు దిగజారిపోవడంతో పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.

#### విరివిగా కంద సాగు..

గత డిసెంబరు, జనవరి నెలలో కంద సాగు ఆరంభిస్తారు. పెరవలి మండలంతో పాటు ఉండ్రాజవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర మండలాల్లో కందను విరివిగా సాగు చేస్తా రు. ఎకరానికి సుమారు 25 గుత్తుల వరకు కంద కొనుగోలు చేసి నాటతారు. దీనికి ఎరు వులు, ఇతర ఖర్చుల కింద వేలాది రూపాయ లు పెట్టుబడులు పెడతారు. ఆగస్టు నెల నుంచి కంద పక్వానికి వస్తుంది. సెప్టెంబరు అక్టోబరు నెలల్లో కూడా తవ్వకాలు ఉంటాయి. ఈ ఏడాది ధర లేకపోవడంతో తవ్వకాలు నెమ్మదిగా సాగుతున్నాయి. ఎకరానికి 50 నుంచి 80 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో చేలు కౌలుకు తీసుకుని కంద సాగు చేసే రైతులు సిస్తులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రేటు సగానికి పడిపోవడంతో ఎటూ పాలుపోని స్థితి లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని..విత్తనం ఖరీదు రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.



#### ఎకరాకు రూ.లక్ష నష్టం..

ఎకరం కంద సాగుకు పెట్టుబడి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అవుతుందని ప్రస్తు తం దిగుబడిని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వస్తుందని దీంతో రూ.లక్ష పైగా నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇక్క డి నుంచి కంద బీహార్, పశ్చిమబెంగాల్,తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం రేటు బాగోలేకపోవడంతో ఎగుమతులు కూడా మందగించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.





మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాని

## 19న చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మిథున్ రెడ్డిని మాజీ మంత్రులు గోవర్ధన్ రెడ్డి, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంగోపాల్ రెడ్డి మంగళవారం ములాఖత్ ద్వారా కలిసి మాట్లాడారు.చం ద్రబాబును ప్రశ్నించినా..విమర్శించినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సాధారణంగా ప్రభుత్వాల్లో చిన్న కేసు లను పెద్ద కేసులుగా బనాయిస్తారని.. చంద్రబాబు ఎక్కడా లేని కేసులను సృష్టిస్తున్నారన్నారు. తనను 86 రోజులు జైలులో పెట్టారన్నారు. సూర్యారావు మాట్లాడుతూ జగన్ స్థాపించిన రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలను వైసీపీ నాయకులు చూడడానికి వస్తే లోపలికి వెళ్లనీయకుండా అడ్డుపడ్డారన్నారు.రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. టీడీపీ ఏం చేసినా కేసుల్లేవని, వైసీపీ నాయకులకు సంబంధం లేకపోయినా కేసులు పెడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని హితవు పలికారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

## ఐదుగురు బైక్ దొంగలు అరెస్టు

● పెరవలి పోలీసుస్టేషన్‌లో 26 మోటారు సైకిళ్లు స్వాధీనం

● మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.20లక్షలు

● విలేకరుల సమావేశంలో కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

పెరవలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దొంగతనానికి గురైన పెరవలి పోలీసులు 26 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం పెరవలి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు తెలిపారు. దీనికి సంబంధించి 25కేసులు నమోదుకాగా ఐదుగురు అంతర్‌జిల్లాల దొంగలను అరెస్టు చేశామని స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.40లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. ఖండవల్లికి చెందిన మోతరపు శివ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ సమయంలో పలు విషయాలు పోలీసులు సేకరించినట్లు తెలిపారు. తుమ్మగంటి ధనుష్(ఖండవల్లి) విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్ (కాకినాడజిల్లా ఒమ్మంగి), అబ్బిరెడ్డి పాపారావు(కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి) ముగ్గురు కలిసి బైక్ నేరాలు చేస్తుంటారు. వీరి ముగ్గురినీ చూసి ధనుష్ తమ్ముడు అయిన నెక్కంటి యువరాజ్(ఖండవల్లి) కూడా దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలని అనుకుని వనచర్ల శక్తిరాజు(ఖండ వల్లి), కూనపరెడ్డి వీరబాబు(ఖండవల్లి)తో కలిసి మోటారు సైకిల్ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరు దొంగిలించిన మోటారు సైకిళ్ల అన్నీ వారి ఇళ్లవద్ద పెట్టుకుని ఒక్కసారిగా అమ్ముదామనుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేసు విచారణలో పెరవలిలో 4, ఉండ్రాజవరం 1, రాజమండ్రిలో 6, బొమ్మూరులో 1, పెనుగొండలో 3, పెనుమంట్రలో 2, ఇరగవరంలో 1, రావులపాలెంలో 3, ప్రత్తిపాడులో 2, సామర్లకోటలో 2, తునిరూరల్‌లో 1, విశాఖజిల్లా ఆనందపురంలో 1, ఎంవీపాలెంలో1 కేసులు నమోదు కాగా మొత్తం 26 మోటారు సైకిళ్లను నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో సుజికీ మోటారు సైకిళ్లు 15, రాయల్ ఎన్‌ఫీల్డ్ 6, పల్సర్‌బైక్‌లు 4, హెచ్‌ఎఫ్ డీలక్స్ 1, కేసు విచారణలో నిందితుల అరెస్టులోనూ పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు, నిడదవోలు సీఐ వీవీజీ తిలక్, పర్యవేక్షణలో ట్రైనీ ఎస్‌ఐ కె.సౌజన్య, పోలీసు స్టేషన్ సిబ్బంది కె.శ్రీహరి, నరేంద్ర, ముత్యాలు, గంగాధరరావు, ప్రసాద్, రమేష్, హనుమంతు, శ్రీను, పవన్, సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, జి.అనిల్‌లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.వీరందరికీ రివార్డులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

## హామీలు అమలుచేయకపోతే ఆందోళనకు దిగుతాం

● ఐఎఫ్‌టీయూ నాయకులు



ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిడదవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో భవననిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో కార్మికవర్గం అంతా దశలవారీగా ఆందోళనకు దిగుతామని ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ ప్రగతిశీల భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈమని గ్రీష్మకుమార్, నాగరాజు అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా తాను ఇచ్చిన హామీలపై సరైన నిర్ణయం ప్రకటించాలని లేని పక్షంలో కార్మికవర్గ ఆగ్రహాన్ని ఎదుర్కోవడం తప్పదన్నారు. ఈ సమావేశంలో రమణ, దాన వరప్రసాద్, పైడి నాయుడు, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు..

### వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ మిషన్లు సరఫరా చేస్తానని ఒప్పందం కుదుర్చుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీకి 12 బయోమెట్రిక్ మిషన్లు సరఫరా చేయడానికి విశాఖపట్నంనకు చెందిన స్మార్ట్ టెక్ సొల్యూషన్స్ అధినేత జి.మదుమోహన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. 8 మిషన్లు సరఫరాచేసి మిగిలిన 4 మిషన్లు సరఫరా చేయకుండా, ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో ఫ్యాక్టరీ హెచ్‌ఆర్ మేనేజర్ వల్లూరి అమ్మిరాజు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మధుమోహన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ జారిపడి తలకు గాయమై చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు కొవ్వూరురూరల్ ఏఎస్‌ఐ కె.నాగభూషణం తెలిపారు. పెనకనమెట్టకు చెందిన పసలపూడి పెద్దయ్య(50) ఈనెల 13వ తేదీన ధర్మవరంలోని కుమారుడి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 1గంట సమయంలో కాళ్ళు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తూ కాలు జారిపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 15న రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య బుజ్జమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### కొబ్బరి చెక్కలకు బహిరంగ వేలం

పెరవలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కొబ్బరిచెక్కలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. రెండు సంవత్సరాల కాల పరిమితికి కొబ్బరి చెక్కల పాటను ఒక సంవత్సరానికి ఏడు లక్షల 6వేలు తలనీలాలు తీసుకునే హక్కుకు సంవత్సరానికి 71 వేల రూపాయలు పాట వచ్చినట్లు తెలిపారు.



## ఘర్షణపడి అధికారుల విధులకు ఆటంకం



మల్లేశ్వరంలో ఇరువర్గాల సమస్యను విచారిస్తున్న అధికారులు

పెరవలి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరంలో ఒక సమస్య పరిష్కారం నిమిత్తం వెళ్లిన అధికారులపై ఇరువర్గాలు ఘర్షణ పడి ఆ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. మల్లేశ్వరానికి చెందిన ఒక వ్యక్తి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సమస్య పరిష్కరించడానికి తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో ఉమారాజ్యలక్ష్మి, మంగళవారం మల్లేశ్వరం సచివాలయానికి వెళ్లారు. ఇరువర్గాలను పిలిచి దస్తావేజులు పరిశీలిస్తుండగా ఇరువర్గాలు ఘర్షణపడి అధికారుల విధులకు అంతరాయం కలిగించారు. అంతేకాకుండా అధికారులపై కూడా కేకలు వేశారు. దీంతో విచారణను మధ్యలో ముగించి అధికారులు వెళ్లిపోయారు. ఈ విషయమై వీఆర్‌వో పంచాయతీ సెక్రటరీలు పెరవలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేటి నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాలు

కొవ్వూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసినట్లు వైద్యులు డా.సిహెచ్.దివ్య, డి.డి.సాంబశివరావులు తెలిపారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాలు లక్ష్యంగా ప్రభుత్వం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. వైద్యులు మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ బలోపేతం చేయడం, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, సాధికారత కలిగిన సంఘా న్ని నిర్మించడం కౌమార బాలికలు, స్త్రీలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్, రక్తహీనత, కళ్లు, దంత సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి):** మండలంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థ్‌నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గామల్లేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఈ కార్యక్రమంపై వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్యం-బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**చాగల్లు(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ నారీ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీ రామారావు తెలిపారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గ్రంధి రాంబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా జరిగే వైద్య శిబిరంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## మౌళిక సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలి

కొవ్వూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మౌళిక సదుపాయాల కల్పనకు పూర్వవిద్యార్థు లు, దాతలు సహకరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూ రు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019లో కొవ్వూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల కొనసాగుతోంది. ప్రతీ సంవత్సరం విద్యార్థులు పెరుగుతుండడంతో అటు జూనియర్ కళాశాల, మరోవైపు డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో కొవ్వూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. భూమి కేటాయించి, భవనాల నిర్మాణం చేపట్టి పూర్తిచేయడానికి సంవత్సరం పైగానే పట్టే అవకాశం ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాతభవనంలో రూములు మరమ్మతులకు, మన పట్టణంలోని మన హైస్కూల్, మన జూనియర్, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు భాగస్వాములై సహకరించాలన్నారు.

## ‘అభివృద్ధి, సంక్షేమానికి ఆద్యుడు అన్న ఎన్టీఆర్’



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూడు, గూడు, బట్ట ప్రతీఒక్కరికీ అందజేయాలన్న సంకల్పంతో అభివృద్ధి, సంక్షేమానికి ఆద్యుడు అన్న ఎన్టీ రామారావేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. తొక్కిరెడ్డిగూడెం గ్రామంలో 25మందికి గుడ్డిగూడెంలో 108 మందికి ఇంటిస్థల స్వాధీన పత్రాలు అందజేశారు. అనంతరం గుడ్డిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని రాష్ట్రంలో ప్రతీఒ క్కరికి కూడు, గూడు, బట్ట అందించాలన్న సదుద్దేశంతో 1984లో నే అధికారం చేపట్టి 30రూపాయలు సామాజిక భద్రతా పింఛన్ పేరుతో అందజేశారని అన్నా రు. నాటి నుంచి నేటి వరకు వృద్ధ, వికలాంగ వితంతువులకు పింఛన్‌తో భరోసా కల్పించారని అన్నారు. గుడ్డిగూడెంలో ఉపాధినిధులతో 500 మీటర్ల మేర నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.71లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, మాజీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుదే సత్యనారాయణ, కార్యదర్శి శెట్టి సత్యనారాయణ, సర్పంచ్ ప్రసాద్, సొసైటీ ఛైర్మన్‌లు వడ్లమూడి రమేశ్, గద్దే హరిబాబు, నూతంగి దొరబాబు, తాహసీల్దార్ సాయిప్రసాద్, సీఐ నాయక్, ఎస్సై మనోహర్, సీనియర్ నాయకులు విష్ణురాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భారీగా పాల్గొన్నారు.

## విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● ఎమ్మెల్యేను కలిసిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు



ఎమ్మెల్యే మద్దిపాటికి వినతి పత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

నల్లజర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని ఏపీయూడబ్ల్యూజే గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం అచ్చన్నపాలెంలో నియోజకవర్గ విలేఖర్ల సంఘ సమావేశం సహాయ కార్యదర్శి చెల్లు మోజేష్ అధ్యక్షతన జరిగింది. అనిల్ మాట్లాడుతూ విలేఖర్ల సంఘాభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని, అందరికీ ఇళ్లస్థలాలు, ఇన్సూరెన్స్, టోల్‌గేట్‌లో రాయితీ, ప్రవేట్ విద్యాసంస్థల్లో 50శాతం రాయితీ వంటి ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటికి వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే విలేఖర్ల డిమాండ్స్‌కు సానుకూలంగా స్పందించారు. వచ్చేనెల నుంచే విలేఖర్లకు ఇన్సూరెన్స్ అందించే విధంగా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు.

### ఆప్కాబ్ చైర్మన్‌ను కలిసిన సొసైటీ చైర్‌పర్సన్లు

దేవరపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు మౌలికసదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుని మండలంలోని సొసైటీ చైర్‌పర్సన్లు ఆండ్రూ అనిల్, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, కోరారు. మంగళవారం భీమడోలులోని ఆప్కాబ్ చైర్మన్ ఇంటివద్ద సొసైటీ చైర్‌పర్సన్‌లు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, టీడీపీనాయకులు కలిశారు. సొసైటీ చైర్‌పర్సన్లు ఆండ్రూ అనిల్, పెనుమత్స సుబ్బరాజు, ఉప్పులూరి రాంబాబులు మాట్లాడుతూ రైతులకు రుణాలు పెంచాలని, గోల్డ్‌లోన్‌లు బయట కమర్షియల్ బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకి ఇవ్వాలన్నారు.

## ‘ప్రభుత్వం కార్పొరేట్లకు మద్దతిస్తోంది’

నిడదవోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీలన్నీ పీపీపీ మోడల్‌లో నిర్మాణం చేసేలా క్యాబినెట్ నిర్మాణం చేయడం తప్పని బీఎస్పీ నాయకులు బయ్యే మునీంద్ర అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణలోని ఆర్టీసీ డిపో సెంటరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల నిర్మాణం నుంచి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవడం కరెక్ట్ కాదన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల పేద మెడికల్ విద్యార్థులు నష్టపోతారన్నారు. సమావేశంలో అంబటి పుల్లారావు, తాడేపల్లి రాజన్‌బాబు, నేలపూరి రత్నాజీ, ఎలిపే వెంకట్రావు, తలారి బాబు పాల్గొన్నారు.

## ‘ప్రజా సమస్యలపై చర్చ జరగాలి’

చాగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) సమావేశాలు తూతూ మంత్రంగా కాకుండా ప్రజా సమస్యలపై చర్చ జరిగి వాటి పరిష్కారానికి వేదిక కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైన్‌లు పుష్కరాల సందర్భంగా పూర్తిగా అభివృద్ధి చేస్తానని సభకు తెలిపారు. పీఎం సూర్య ఘర్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈసందర్భంగా అన్నారు. చిక్కాలపాలెం ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు మాట్లాడుతూ చిక్కాలపాలెం, చిక్కాల మీదుగా గ్రామ ప్రజలకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కోఆప్షన్ సభ్యుడు సర్దార్ పాషా మాట్లాడుతూ చాగల్లులో కుక్కలబెడద, కోతుల బెడద ఎక్కువగా ఉందని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని ఎస్.ముప్పవరంలో అర్హులైన తమ పేరున ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రభుత్వం ఆదుకుంటుంది

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



పిల్లలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం సమగ్రశిక్ష- పాఠశాల విద్యాశాఖ సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో అలింకో సంస్థ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులకు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పింఛను రూ.6వేలకు పెంచిందన్నారు. మంచానికే పరిమితమైనవారికి రూ.15వేలు అందజేస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తామన్నారు. ప్రభుత్వం అందించే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలున్నట్లయితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లయితే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో ఇళ్లులేని ప్రతిఒక్కరికీ గ్రామీణ ప్రాంతాలలో 3సెంట్లు, పట్టణప్రాంతాలలో 2సెంట్లు చొప్పన ఇంటిస్థలాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సుభాషిణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావనరత్నకుమారి, ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సెపక్‌తక్రా జిల్లా జట్టు ఎంపిక



సెపక్‌తక్రా జిల్లా జట్టుకు ఎంపికైన బాలురు, బాలికలు

దేవరపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇండోర్ స్టేడియంలో మంగళవారం సీనియర్ సెపక్‌తక్రా జిల్లా జట్టు ఎంపిక చేశారు. రాష్ట్ర సాప్ డైరెక్టర్ రవీంద్రనాధ్ మాట్లాడుతూ సెపక్‌తక్రా సీనియర్ బాలురు, బాలికల జట్టు ఎంపిక చేశామని, ఈనెల 27న ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. సెపక్‌తక్రా బాలుర జట్టు ఎల్.గణపతి, సీహెచ్. సతీశ్, పీ.సాయి, కే.పవన్‌కుమార్, వంశీ, బి.రవితేజ, బాలికలు జట్టు పి.మాధురిశ్రీ, ఎం. మహాలక్ష్మి, టీ.నవ్యశ్రీ, కే.వర్షిణి, కే.సుభాషిణి, కే.లతిక సుధాశ్రీ, జట్టు ఎంపికైనట్లు రవీంద్రనా ధ్ తెలిపారు. ఓరుగంటి నాగరాజు, రామకృష్ణ, తలారి సరస్వతి పాల్గొన్నారు.